క్లుప్తంగా

పబ్లిక్ హెల్త్‌వర్కర్ నియామకం



నియామకం పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వెంకటరమణ కొది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి భార్యను పబ్లిక్ హెల్త్‌వర్కర్‌గా నియమించారు. ఈమేరకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి సాధిక్ నజీమున్నీసా, కమిషనర్ కిరణ్‌కుమార్ , వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మృతుడి భార్య శారదకు నియామకం పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఓంప్రకాష్, మురళి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

నల్లచెరువు: ఇందుకూరివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామిరెడ్డికి ప్రమాదంలో కాలికి తీవ్రగాయమైంది. విషయం తెలుసుకున్న నల్లచెరువు జెడ్పీటీసీ బసిరెడ్డి అనిత, బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి గురువారం ఆసుపత్రి వద్దకు వెళ్లి పరామర్శించి వైద్యం కోసం రూ.10వేలు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తవళం నాగభూషణ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, మండల కన్వీనర్ హైదర్‌వలి, జేసీఎస్ కన్వీనర్ షమీవుల్లా, కల్లిపల్లి శ్రీనివాసులు, నిరంజన్‌రెడ్డి, బావాఖాన్, పోలం సూర్యశేఖ ర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత



నగదును అందిస్తున్న సర్పంచ్ రహంతుల్లా

గాండ్లపెంట: వద్దిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు ఈ నెల 1న మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద గురువారం సర్పంచ్ రహంతుల్లా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్‌రఫీ, సచివాలయ సిబ్బంది ఊర్మిళ, మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహగౌడ్, యూనుస్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలపై అవగాహన



విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహిస్తున్న కృష్ణమూర్తి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భూగర్భ జలాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రీజనల్ డైరెక్టర్ జీ క్రిష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత హాజరయ్యారు. రాష్ట్రంలో జలస్తర రేఖా చిత్రాలు, నిర్వహణా ప్రణాళిక అన్న అంశంపై విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహించారు. అనంతరం భూగర్భ జలాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీనియర్ శాస్త్రవేత్తలు రేష్మా, పిళ్లయ్, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కృష్ణవేణిని సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: బూగురుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని తోటి ఉపాధ్యాయులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఒకవైపు క్యాన్సర్‌తో పోరాడుతూ మరోవైపు పిల్లల చదువులకు తన వంతు సాయంగా విద్యాసామగ్రిని అందజేస్తున్నందుకు కృష్ణవేణిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధామయి, ప్రభ, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం సీడీపీఓ గంగరత్నమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రఫీమున్నీషా, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలంతా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, లలితమ్మ, ఏపీఎం హేమలత, మహిళా సంఘాల నేత పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ధీమా.. పంటకు బీమా

- పకడ్బందీగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా
- రైతు తరఫున ప్రీమియం మొత్తాన్ని భరిస్తున్న సర్కారు
- జిల్లాలో మూడు లక్షల మంది రైతులకు ప్రయోజనం
- ఒక్క కదిరి నియోజకవర్గంలోనే 55,755 మందికి లబ్ధి

కదిరి నియోజకవర్గంలో ఉచిత పంటల బీమా వివరాలు ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన	రైతులు నగదు (రూ.కోట్లలో)
2019-20	55,755	42.89
2020-21	15,010	10.58
2021-22	22,828	22.35
2022-23	34,062	31.71
మొత్తం	55,755	107.53



కదిరి: వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఖరీఫ్–2019 సీజన్‌లో ఒక్క రూపాయి ప్రీమియంతో ఈ పథకం అమలు చేశారు. తర్వాత సీజన్ నుంచి జగన్ ప్రభుత్వమే ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తోంది. అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ఈ పథకం రైతుకు తోడుగా ఉంటోంది.

ఎదురుచూపులకు స్వస్తి

గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోతే రబీ సీజన్ పూర్తవుతున్నా రైతుకు బీమా డబ్బు చేతికి అందేది కాదు. ఏడాదికి పైగా ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలా లేదు. పంట దెబ్బతిన్న వెంటనే సంబంధిత అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారు. ఇవి అందిన వారం రోజుల్లోపే బీమా డబ్బులు రైతు ఖాతాలో జమ అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధామమంత్రి ఫసల్ బీమాతో ఎలాంటి సంబంధం లేకుండా జగన్ ప్రభుత్వమే సొంతంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేయడం చరిత్రాత్మకమని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ పథకం సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని వ్యవసాయ మేధావి వర్గం కూడా ప్రశంసిస్తోంది.

రైతుల ఖాతాల్లోకి రూ.718 కోట్లు

డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 2,96,541 మంది రైతులకు గడిచిన ఐదేళ్లలో రూ.718.57 కోట్లు చెల్లించింది. ఇందులో ఒక్క కదిరి నియోజకవర్గంలోనే 55,755 మంది రైతులు లబ్ధి పొందారు. నేరుగా వీరి బ్యాంకు ఖాతాల్లో రూ107.53 కోట్లు జమ అయింది. రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, వరి, కంది, ఆముదం ఇలా మొత్తం 26 రకాల పంటలకు ఈ పథకం వర్తిస్తోంది.

జగన్ రైతుల పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. రైతుభరోసా, సున్నావడ్డీ పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇలా చాలా ఇస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే రైతు పండించిన పంటకు బీమా వస్తోంది. సీఎం జగన్‌ను రైతుపక్షపాతి అనొచ్చు.

–రైతు అశోక్‌వర్ధన్‌రెడ్డి, తనకల్లు

జాతీయస్థాయిలో ప్రశంసలు



ఏపీలో అమలు చేస్తున్న 'డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా' పథకానికి ఇటీవల జాతీయ స్థాయిలో ప్రశంసలు వచ్చాయి. రైతులపై పైసా భారం పడకుండా ఈ–క్రాప్ ఆధారంగా వర్తింపజేస్తున్నారు. పంట నష్టపోయిన నెల రోజుల్లోపే రైతు ఖాతాలో డబ్బు జమవుతోంది. ఏపీ తరహాలోనే మా రాష్ట్రాల్లో కూడా ఉచిత పంటల బీమా అమలు చేస్తామని మహారాష్ట్ర, ఒడిషా, పుదుచ్చేరి, మేఘాలయ రాష్ట్రాలు ముందుకొచ్చాయి.

– సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

స్థానిక పాలన కోసమే గ్రామ సచివాలయాలు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తుమ్మల గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు అక్కడే పరిష్కరించాలనే ప్రభుత్వం గ్రామ పాలనకు శ్రీకారం చుట్టి గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల భవనాలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తుమ్మల గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం జగనన్న సాకారం చేసి చూపించారన్నారు. గ్రామ పాలన ద్వారా లంచాలకు తావు లేకుండా సొంతూళ్లోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి పంచాయతీలో రూ.కోటి నిధులతో అవసరమైన భవనాలన్నీ కట్టించి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఉద్యోగులను నియమించామన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను గ్రామ వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే చేరుస్తున్న జగనన్నకు మనమంతా తోడుగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. మరో సారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడానికి సహకరించాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ లక్ష్మీపతి, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనతో పేదల కళ్లలో ఆనందం

- సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్



21వ వార్డులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: జగనన్న పాలనతో నియోజకవర్గంలో ఏ గడపకు వెళ్లినా పేదల కళ్లలో ఆనందం కనపడుతోందని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 21వ వార్డులో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి 57 నెలల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోక్కసారి ముఖ్యమంత్రిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు సాధించుకునేందురు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది జీర్ణించుకోలేని చంద్రబాబు కూటములతో జతకట్టి కుయుక్తులు పన్నుతున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తలకిందులు తపస్సు చేసినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయాన్ని అడ్డుకోలేరన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు జిలాన్, పరికి సాదిక్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, సమన్వయకర్త శాంతమ్మ

కనగానపల్లి: గతంలో మాదిరిగా ఫ్యాక్షన్ హత్యలు, ఘర్షణకు దూరంగా గ్రామాలను అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తగరకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మతో కలిసి సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో గతంలో జరిగిన ఫ్యాక్షన్ ఘర్షణల వల్ల ఎంతో అమాయకులు ప్రాణాలు పొగొట్టుకొన్నారన్నారు. ఇక్కడ పరిటాల కుటుంబ సభ్యులు ఆర్థికంగా, రాజకీయంగా బలపడేందుకు ఎంతో మంది బీసీ, ఎస్సీ వర్గాల ప్రజలను బలిపశువులను చేశారని మండిపడ్డారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎక్కడా గొడవలకు తావులేకుండా ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఇందుకు ప్రధాన కారణం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలే అని తెలిపారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. నియోజకవర్గంలోని రైతన్నల కోసం సాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చి, ఈ ప్రాంతాన్ని పచ్చని పొలాలతో సస్యశామలం చేశామన్నారు. గత 25 ఏళ్లలో ఎప్పుడు జరగని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు. సమన్వయకర్త శాంతమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉన్నారన్నారు. ఇలాగే ప్రభుత్వం పది కాలాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలు, మేకల ఫెడరేషన్ అధ్యక్షుడు నరసింహాగౌడ్, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్‌లోని అతిపురాతన బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ పార్వతి పరమేశ్వరులస్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు హాజరయ్యారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో అర్చకుల వేదమంత్రాల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం జరిగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

శివాలయం రథోత్సవానికి తరలిరండి

శుక్రవారం జరిగే రథోత్సవానికి భక్తులు తరలిరావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కోరారు. ఉదయం మడుగు తేరు, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు ఉక్కిశిల గోవిందు, చేనేత నాయకులు గుర్రం రాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన



పథకాలను వివరిస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలన్నా.. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చెందాలన్నా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ప్యాదిండి పంచాయతీలోని గొల్లవాండ్లపల్లి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. నామాల, చందమూరు, ప్యాదిండి గ్రామాల్లో మండల, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. అన్ని వర్గాల వారికి కుల, మత బేధాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జిగ అంజలి, జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, నాయకులు ప్యాదిండి నరసింహారెడ్డి మాజీ సర్పంచ్ లింగారెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్ రెడ్డి, నామాల శీన, పెద్దారెడ్డి, ముత్యాల రామకృష్ణ, అల్లే రామకృష్ణారెడ్డి, ఓబిరెడ్డి, బుర్రా నాగేంద్రరెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, ఎం.ప్రకాష్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, కిష్ట, రమణ, మండల నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను అందిస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్లోని 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ రమణారెడ్డి పిన్సిపాల్ రాణాప్రతాప్ నాయక్ గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల తల్లి దండ్రులకు విద్య భారం కాకూడదనే ఉద్దేశంతో జగనన్న అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదియార్తి, ఆకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రేగాటిపల్లి, బత్తలపల్లి బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ మాధవి గురువారం తెలిపారు. రేగాటిపల్లి(బత్తలపల్లి) పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

తనకల్లు: రైతులు పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మహాలక్ష్మీ కోరారు. స్థానిక ఏడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో సీఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాల ద్వారా ఇచ్చిన పంట రుణాలను ఈ నెల 31 లోపు రెన్యూవల్ చేయాలన్నారు. సీహెచ్‌సీ, జేఎన్‌జీ, ఎస్‌హెచ్ లోన్లను రికవరీ చేయాలన్నారు. డిపాజిట్లపై అధిక వడ్డీని చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓలు సుధాకరాచారి, మల్లికార్జునరెడ్డి, సుబ్బిరెడ్డి, సిబ్బంది ఫణికంఠరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

ధర్మవరం: పట్టణ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి ప్రారంభమవ్వడంతో నీటి కొరత లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులకు వేతనాల పెంపు, పట్టణంలో రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.4.5 కోట్ల విడుదల చేయడంపై కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. వార్డుల్లోని పలు సమస్యలపై కౌన్సిలర్లు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని చైర్‌పర్సన్ కమిషనర్ రామ్‌కుమార్‌కు ఆదేశించారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ధర్మవరం అర్బన్: పట్టణంలో గురువారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ అశోక్ కుమార్ సమక్షంలో బీఎస్‌ఎఫ్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు కవాతు నిర్వహించారు. ధర్మవరం నియోజకవర్గానికి ఎన్నికల విధులకు బీఎస్‌ఎఫ్ స్పెషల్ ఫోర్స్ వచ్చారని, ఎన్నికలు ముగిసేవరకు వారు విధులు కొనసాగిస్తారని డీఎస్పీ తెలిపారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

తనకల్లు: బాలసముద్రం జంబులింగేశ్వర స్వామి ఆలయానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నేత ఎంజీ రెడ్డి గురువారం మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆలయానికి అవసరమైన మైక్ సెట్ కావాలని ఎంజీ రెడ్డిని కోరగా ఆయన వెంటనే రూ. 50 వేలు విలువైన మైక్ సెట్ అందజేశారన్నారు. గతంలోనూ ఆలయాభివృద్ధికి రూ. 40 వేలు అందించారని తెలిపారు. ఎంజీరెడ్డి టీం సభ్యులు వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్దారెడ్డి, బాబా ఫక్రుద్దీన్, రహంతుల్లా, శ్రీరాములు, పూల శీనా, అయూబ్, ముబారక్, చంద్ర, వెంకటరమణ తదిరతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

పుట్టపర్తి: స్థానిక సాయి ఆరామంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఓ ప్రకటనలో తెలియజేసింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలతారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, ఇతర ఉపాధ్యాయ రాష్ట్ర సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఘనంగా అచ్చేమియా ఉరుసు



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: చింతమానిపల్లిలో గురువారం సయ్యద్ షా అచ్చేమియా సాహెబ్ ఉరుసు ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముస్లింలతో కలిసి దర్గాకు చేరుకుని ఫాతేహాలు సమర్పించారు. అనంతరం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ వెంకట నారాయణ, సీనియర్ నాయకులు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగాయి. గురువారం గణితం–2ఏ, పౌరశాస్త్రం–2, వృక్షశాస్త్రం పరీక్షలకు మొత్తం 78 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 74 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు.

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 126 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కవిత తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలు

నల్లమాడ: 2024–25 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం మంది పేద విద్యార్థులను ఉచితంగా చేర్పించనున్నట్లు ఎంఈఓలు వెంకటనారాయణ, సురేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన వారు ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో www.csc.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథ విద్యార్థులు, హెచ్ఐవీ ప్రభావిత బాధితులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు 6 శాతం చొప్పున కేటాయించినట్లు తెలిపారు.

జాబ్‌మేళా పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 12న బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఇందులో భాగంగా ఈనెల 12న బుక్కపట్నం సత్యసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారులను అభినందిస్తున్న ముఖ్య అతిథులు

ధర్మవరం: పట్టణంలోని సూర్య స్కూల్‌లో గురువారం రాత్రి పాఠశాల 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి, విద్యాసంస్థల ప్రముఖులు సీతారామయ్య, వైద్యులు సుధాకర్, ఉపాధ్యాయుడు సురేష్ హాజరయ్యారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రబాబు శాలువాలతో సత్కరించారు.